క్లుప్తంగా

శ్మశానం ఆక్రమణపై కేసు



ఆక్రమణకు గురైన శ్మశానాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ పద్మావతి

జే.పంగులూరు: మండల పరిధిలోని బూదవాడ గ్రామంలోని దళిత కాలనీకి చెందిన శ్మశాన ఆక్రమణపై సోమవారం కేసు నమోదు అయినట్లు రేణింగవరం ఎస్సై తిరుపతిరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బూదవాడ దళిత కాలనీకి చెందిన శ్మశానం గతంలో వివాదం పరిష్కరించిన రెవెన్యూ అధికారులు కొలతలు వేసి హద్దురాళ్లు పాతారు. శ్మశానికి చుట్టూ ఉన్న రాళ్లు పీకివేసి, శ్మశానికి వెళ్లే బాటను ట్రాక్టర్‌తో ఆరుమళ్ల రవి అనే యువకుడు దున్నేసినట్లు తెలిపారు. ఈ విషయమై దళిత కాలనీకి చెందిన వారు తహశీల్దార్ ఐ పద్మావతికి ఫిర్యాదు చేశారు. ఈవిషయమై తహశీల్దార్ రేణింగవరం పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఆరుమళ్ల రవిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డయల్ యువర్ డీఎంకు వినతులు

చీరాల అర్బన్: ప్రయాణికులు సమస్యలు, సలహాలు, సూచనలు అందించేందుకు సోమవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి మూడు వినతులు అందినట్లు డిపో మేనేజర్ జంజనం శ్యామల తెలిపారు. వీటిలో చీరాల నుంచి తెనాలికి బస్సు నడపాలని, చీరాల నుంచి వయా స్వర్ణ మీదగా ఇంకొల్లు వెళ్లే బస్సు సమయం ముందుకు జరపాలని ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి నెల 10న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రయాణికులు ఎవరైనా తమ సమస్యలు, సలహాలు, సూచనలు అందించవచ్చన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



పోలీసు స్టేషన్ వద్ద ఉన్న ఇసుక ట్రాక్టర్లు

వేటపాలెం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని పందిళ్లపల్లి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి సురేష్ సోమవారం తెలిపారు. పందిళ్లపల్లిలో వివిధ అక్రమ క్వారీల ద్వారా ఇసుకను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ట్రాక్టర్లను పట్టుకొని పోలీసు స్టేషన్‌కి తరలించి డ్రైవర్లపై కేసులు నమోదు చేశామని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న నియోజకవర్గ ఈఆర్‌ఓ వెంకటనారాయణ

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు తహశీల్దారు కార్యాలయంలో పర్చూరు నియోజకవర్గ ఈఆర్‌ఓ వెంకటనారాయణ మండల బీఎల్‌ఓలు, పర్యవేక్షకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఎస్‌ఆర్ 2024 భాగంగా ఫారం-6,7,8, పెండింగ్ క్లెయిమ్స్ గురించి పీఎస్ఈ డీఎస్ఈలపై సమీక్ష నిర్వహించారు. బీఎల్‌ఓలకు క్లైమ్స్ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. వారి సందేహాలకు సూచనలు అందించారు. సమావేశంలో తహశీల్దారు బ్రహ్మయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అర్జీల విచారణ వేగవంతం చేయాలి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్, స్పందన అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ పి.సురేష్ కుమార్, ఆర్ఐలు డి.అర్జున్, శేఖర్, వీఆర్వోలు ఉన్నారు.

ఆశాజనకంగా ఏటీఎం మోడల్

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని వంకాయలపాడులో ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌చార్జ్ బలగాని వెంకటస్వామి చిన్నా అనే రైతుతో ఏటీఎం మోడల్ సాగు నిర్వహించారు. కూరగాయలు, ఆకుకూరలు పండించి తోటి రైతులకు ఆదర్శంగా నిలిచారు. ఆరోగ్యంతో పాటు, ఆదాయం వస్తున్నందున వలన ఏటీఎం సాగుతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ అప్పారావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కైలాసాన కార్తీకాన.. శివ రూపం

- ఘనంగా కార్తీక సోమవారం పూజలు
- చివరి రోజు కావడంతో పోటెత్తిన భక్తులు



అద్దంకి కోటి దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



గన్నవరంలో విశేష అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి

యద్దనపూడి: కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని మండలంలోని ఆలయాలన్ని భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉదయాన్నే భక్తులు ఆలయాలకు చేరుకొని ఉసిరి, రాగి చెట్టు వద్ద కార్తీక దీపాలను ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రీతిపాత్రమైన అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గన్నవరం కాశీవిశ్వేశ్వర స్వామి, పూనూరు త్రిపురాంతకస్వామి, యద్దనపూడి రామలింగేశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి, చింతపల్లిపాడు చెన్నకేశవస్వామి ఆలయాల్లో స్వామివారికి విశేషపూజలు, అలంకరణలు నిర్వహించారు. పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న త్రిపురసుందరి సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని అయ్యప్ప పడిపూజా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అయ్యప్ప, భవాని, లక్ష్మి మాలాధారుల స్వాముల ఆధ్వర్యంలో పడిపూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నరసరావుపేట భజనాబృందం ఆలపించిన భక్తిగీతాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది.

దీపాలతో వెలిగిన దేవాలయాలు..

అద్దంకి/జే.పంగులూరు: కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులు వెలిగించిన కార్తీక దీపాలతో వెలిగిపోయాయి. కార్తీక మాసంలో చివరి సోమవారం కావడంతో ఆలయాలకు మహిళా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. మండలంలోని స్వయంభూ దేవాలయం మణికేశ్వరంలోని మల్లీశ్వరస్వామి ఆలయానికి జిల్లాతోపాటు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి, ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు పెట్టారు. భక్తులకు కమిటీ సభ్యులు అన్నప్రసాదం పెట్టారు.

జే.పంగులూరు మండల పరిధిలోని పంగులూరు సచివాలయ వద్ద సోమవారం శివకళ్యాణం, కోటి దీపోత్సవం గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రుడు పూర్ణుడై ఏ నక్షత్రంలో ఉంటాడో ఆ నక్షత్రం పేరు మీదుగా ఆ మాసానికి వస్తుందన్నారు.

కారంచేడులో ఘనంగా కోటి దీపోత్సవం..

కారంచేడు: కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకొని సోమవారం కోటి దీపోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో ఆలయ ధర్మకర్తలతో పాటు, అభివృద్ధి కమిటీల ఆద్వర్యంలో ఘనంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రెండు చెరువుల మధ్యన వాటర్ ట్యాంక్ సమీపంలో గ్రామానికి చెందిన మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున దీపోత్సవానికి తరలివచ్చారు. ప్రతి ఒక్కరూ దీపాలను వెలిగించి స్వామివారి, అమ్మవార్ల ఆశీర్వాదాలు తీసుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

చీరాల అర్బన్/వేటపాలెం: కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిక్కిరిపోయాయి. పట్టణంలోని దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు దేవాలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. పట్టణంలోని చీరాల, పేరాల శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. పేరాల శివాలయంలోని పునుగు రామలింగేశ్వరస్వామికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకాలు, సత్య సహస్ర దీపాలంకరణ పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో వచ్చే సోమవారాలు, కార్తీక పౌర్ణమి పర్వదినాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: అద్దంకిలోని శ్రీవింధ్య వాసిని సమేత నగరేశ్వరస్వామి (వేయి స్తంభాల దేవస్థానం)లో ఉదయం 130 మంది మహిళల భక్తులతో సామూహిక శివలింగార్చన, అభిషేకాలు నిర్వహించారు.

సీఎం జగన్ హయాంలోనే అభివృద్ధి



దేవినూతల సభలో మాట్లాడుతున్న ఏపీఎం సుబ్బారావు



చెన్నుపల్లి లో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న పేరయ్య, ఎంపీపీ



ధేనువుకొండలోమ డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్, నాయకులు

చీరాల టౌన్: రాష్ట్రాభివృద్ధితో పాటుగా రాష్ట్ర ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసేందుకు అందరు సిద్ధంగా ఉన్నారని మండల పార్టీ అధ్యక్షుడు ఎ.అంకాళరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావులు అన్నారు. సోమవారం మండలంలోని దేవినూతల సచివాలయాల పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనన్నే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను రూపొందించి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ద్వారా అందరికి పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సుబ్బారావు, జేసీఎస్ కన్వీనర్ బి.సాంబశివరావు, పార్టీ కార్యదర్శి శివపార్వతి, నారాయణ, కోటేశ్వరరావు, శివయ్య, పద్మావతి, నారాయణ, శ్రీనివాసరావు, సుబ్బారావు, రమేష్, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

జగన్‌ను సీఎంగా చేయాల్సిన బాధ్యత అందరిదీ..

బల్లికురవ: త్వరలో జరిగే ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంగా చేయాల్సిన బాధ్యత ఉందని బాపట్ల జిల్లా రైతు, మండల పార్టీ అధ్యక్షుడు చింతల పేరయ్య అన్నారు. సోమవారం చెన్నుపల్లి సచివాలయంలో పార్టీ జెండా డిస్‌ప్లే, బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం వైఏపీ నీడ్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు టి నరేష్, ఎంపీటీసీ టి. రాహేలు, ఎంపీడీవో బ్రహ్మయ్య, ఈవోఆర్డీ సుమతి, మండలస్థాయి అధికారులు స్థానిక నేతలు డీ రామాంజనేయులు చింతల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని అద్దంకి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ధేనువుకొండ గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ధేనువుకొండ సొసైటీ చైర్మన్ రామిరెడ్డి ఆదిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఉన్నం ప్రసాద్ సచివాలయం వద్ద లబ్ధిదారుల డిస్‌ప్లే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ సీహెచ్ అమ్మన్న, బీ. కల్యాణి, బీ. సుధాకరరెడ్డి, గృహసారథులు పాల్గొన్నారు.

చీరాల వాకర్స్ అసోసియేషన్‌కు అవార్డు



బెస్ట్ సర్వీసు అవార్డులు అందుకుంటున్న ప్రతినిధులు

చీరాల రూరల్: ఆరోగ్యంపై శ్రద్ధ కనబరచడమే కాక సమాజానికి సామాజిక సేవలు అందిస్తూ అందరితో మన్ననలు అందుకుంటున్న చీరాల ఎస్ఆర్ అండ్‌పిఎం వాకర్స్ అసోసియేషన్‌కు బెస్ట్ సర్వీస్ అవార్డు లభించింది. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 208 గవర్నర్ ఎం. వెంకటాద్రి ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని రోటరీ ఆడిటోరియంలో డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్, అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా బెస్ సర్వీసు అవార్డులతో పాటు జ్ఞాపికలను అందజేసి శాలువాలతో సత్కరించారు. స్థానిక వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణ, ట్రెజరర్ వలివేటి మురళీకృష్ణలను వాకర్స్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో నారాయణమూర్తి, వి. పూర్ణచంద్రరావు, రమేష్, రవి, సుబ్బారావు, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల నిర్వహణపై అవగాహన



పరిపాలన విధానాలపై శిక్షణనిస్తున్న రమేష్‌బాబు

కారంచేడు: ప్రతి గ్రామ పంచాయతీల్లో అవసరమైన సాధారణ పరిపాలనా నిర్వహణపై ఆయా గ్రామాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు అన్నారు. సోమవారం ఆయన మండల పరిషత్ సమావేశ హాలులో నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ తరగతిలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో సర్పంచ్ పాత్ర, వార్డుల విధులు, పరిపాలన విధానంలో రికార్డులు ఎలా వినియోగించాలి, ఎలా అప్‌డేట్ చేసుకోవాలనే విషయాలపై శిక్షణనిచ్చారు. పంచాయతీకి వచ్చే నిధులు, వాటిని ఎలా వాడుకోవాలి, ప్రభుత్వ నిధులతో పాటు, టాక్స్‌ల రూపంలో వచ్చే నిధుల నిర్వహణపైన కూడా అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలి



కారంచేడులో కార్యదర్శికి మెటీరియల్ అందిస్తున్న ఎంపీడీఓ



సంతమాగులూరులో కిట్లు అందజేస్తున్న ఎంపీడీవో

కారంచేడు: ఈ నెలలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతి గ్రామ పంచాయతీ నుంచి విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో పీ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని 12 గ్రామ సచివాలయ పరిధిలోని సిబ్బందికి అవసరమైన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. పురుషులకు, మహిళలకు క్రికెట్ పోటీలకు అవసరమైన బ్యాట్‌లు, గార్డ్స్, షటిల్ బ్యాట్స్, వాలీబాల్, నెట్‌లు, రింగ్‌లు అందించారు. గ్రామ స్థాయిలో నిర్వహించే పోటీలు మరింత పటిష్టంగా నిర్వహించాల్సి ఉందన్నారు. దీని కోసం గ్రామ కమిటీలు, కార్యదర్శులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆంధ్రాకు పేరు తేవాలి.. ఎంపీపీ

సంతమాగులూరు (అద్దంకి): ఆడుదాం ఆంధ్రాకు ఎంపికైన క్రీడాకారులు బాగా ఆడి పేరుతేవాలని ఎంపీపీ ఎనుబర్ల యల్లమంద అన్నారు. ఆడుదాం ఆంధ్రాకు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ఎంపీడీవో నల్లూరి శివరామ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రాకు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. దీన్ని ఉపయోగించుకుని విద్యార్థులు తమలో ఉన్న క్రీడా నైపుణ్యాలను బయటకు తేవాలని చెప్పారు. అనంతరం ఎంపీడీవో క్రీడాకారులకు ప్రభుత్వం అందించిన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పంటనష్ట అంచనాలు రూపొందించాలి



మార్టూరులో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

మార్టూరు: తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతుల పంటల వివరాల నమోదును త్వరగా పూర్తి చేయాలని తహశీల్దారు కే సుజాత అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్‌బీకేల సిబ్బందికి సోమవారం అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఏడీఏ మాట్లాడుతూ పంట నష్టం 33 శాతం కంటే ఎక్కువ ఉన్న రైతుల వివరాలను సిబ్బంది ఈ నెల 18వ తేదీ లోపు అంచనాలను రూపొందించి, రైతుల సందర్శనార్థం ఆయా గ్రామాల ఆర్‌బీకేల వద్ద ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కిరణ్‌కుమార్, హెచ్‌ఓ హనుమంతనాయక్, ఆర్‌బీకేల సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: మిచాంగ్ తుఫాన్‌కు దెబ్బతిన్న పంటల వివరాలను గ్రామాలవారీగా నిష్పక్షపాతంగా సేకరించాలని తహశీల్దార్ కె. రవిబాబు కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఎన్యూమరేషన్‌కు సంబంధించి శిక్షణ సమావేశం నిర్వహించారు. మండల టీంలో తహశీల్దార్‌తోపాటు ఏవో ఎస్‌వీపి కుమారి, ఉద్యానవన శాఖాధికారి వీ. హనుమంత నాయక్, ఏఎస్‌వో పంట గణనను పర్యవేక్షిస్తారని తహశీల్దార్ వివరించారు.

వలపర్లలో ముగిసిన క్రికెట్ కోచింగ్



కోచింగ్ పూర్తి చేసుకున్న క్రీడాకారులతో హెచ్‌ఎం, పీఈటీలు

మార్టూరు: ఈనెల 14వ తేదీ వరకు నర్సరావుపేట డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించనున్న అండర్-17 క్రికెట్ పోటీలకు సంబంధించి కోచింగ్ క్యాంప్ సోమవారంతో ముగిసిందని హెచ్‌ఎం నిర్మలదేవి తెలిపారు. గత మూడు రోజుల నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన క్రీడాకారులు మండలంలోని వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణనిచ్చామన్నారు. వీరందరూ క్రికెట్ పోటీలకు హాజరవుతారన్నారు. కోచింగ్ పూర్తి చేసుకున్న క్రీడాకారులు తమ ప్రతిభను చాటి మన ప్రాంత గౌరవ ప్రతిష్ఠలను నిలపాలని హెచ్‌ఎం ఆకాంక్షించారు. కార్యక్రమం పీఈటీలు రవి, దేవరాజు, యాకోబులు పాల్గొన్నారు.

పంటల సాగులో జాగ్రత్తలు అవసరం



కొడవలివారిపాలెం వద్ద నీటి మునిగిన పొగాకును పరిశీలిస్తున్న డీడీఏ, శాస్త్రవేత్తలు

కారంచేడు: నీట మునిగిన వరి, పొగాకు, శనగ, మిరప పంటల్లో తిరిగి సాగు చేపట్టాలంటే అవసరమైన జాగ్రత్తలు తప్పకుండా తీసుకోవాల్సి ఉందని బాపట్ల జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ విజయనిర్మల అన్నారు. సోమవారం ఆమె ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సురేఖతో కలసి కారంచేడు మండలంలోని కొడవలివారిపాలెం, కారంచేడు, స్వర్ణ గ్రామాల్లో పూర్తిగా వర్షపు నీటిలో మునిగిపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు అవసరమైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. తిరిగి పంటలను సాగు చేసే రైతులు తప్పకుండా విత్తనశద్ధి చేయాలన్నారు. ఐదు రోజులకు పైగా నీట మునిగి ఉన్న పంటల స్థానంలో వరలా సాగు చేసే పంటలకు విత్తనశద్ధి లేకుంటే తెగుళ్ల ఆశిస్తాయన్నారు. విత్తనశుద్ధితో పాటు, ట్రైకోడెర్మా విరిడిని 10 కేజీల పశువుల ఎరువుతో కలిపి విత్తన సాగుకు ముందు పిచికారీ చేసుకోవాల్సి ఉందన్నారు. వరి, మిరప, పొగాకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. రైతులు అధైర్యదొద్దని సూచించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. వారి పంటల సాగుతో తీసుకోవాల్సిన మరిన్ని జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కే సుధీర్‌బాబు, భవానీ, లలిత, వెంకటయ్య, జ్యోతి, ఆర్‌బీకేల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, కార్తీక మాసం, జ్యేష్ఠ నక్షత్రం, అమావాస్య తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు.

పంచాయతీలో కార్యదర్శుల పాత్ర కీలకం

బల్లికురవ: గ్రామ పంచాయతీ పరిపాలన, విధుల వినియోగంపై గ్రేడ్ 1 నుంచి 6 వరకు అవగాహన పెంచుకోవాలని మాస్టర్ ట్రెనింగ్ ఎస్ శాయిబాబు తెలిపారు. సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 21 పంచాయతీలోని కార్యదర్శులకు విధులు, బాధ్యతలు నిధుల వినియోగంపై అవగాహనతో శిక్షణ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు విడుదల చేస్తున్న నిధులను సకాలంలో ఖర్చు చేసి ఎప్పటికప్పుడు సర్పంచ్‌ల చేత ఎం బుక్ రికార్డులు చేయించాలని ఎంపీడీవో బ్రహ్మయ్య కోరారు. ఈ సమావేశంలో ఈవోఆర్డీ సుమతి, బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ పాల్గొని మాటాడారు.

మనోవికాస కేంద్రంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న సభ్యులు

చీరాల అర్బన్: చీరాలలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం విఠల్‌నగర్‌లోని చైతన్య మనోవికాస రీహాబిలిటేషన్ సెంటర్‌లోని ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మానవత సంస్థ అధ్యక్షులు ఎ.నాగవీరభద్రాచారి మాట్లాడుతూ విద్యార్థులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అలానే అనాథలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని త్వరలో చేపడతామన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి వడలి రాధాకృష్ణ, డైరెక్టర్ వెంకన్నబాబు, పి.శివాంజనేయప్రసాద్, ఎం.పిచ్చయాచార్యులు, షేక్ సిలార్ సాహెబ్, న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్, రిటైర్డ్ ఎంఈఓ యస్. యల్లమందారెడ్డి, వి.దుర్గాప్రసాద్, భార్గవిలు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య భారతి జయంతి



సుబ్రహ్మణ్య భారతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మార్టూరు: ప్రముఖ కవి, రచయిత, సంఘ సంస్కర్త సుబ్రహ్మణ్య భారతి 141 జయంతి వేడుకలను మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం రూత్ మెర్సీజాయ్ ఉపాధ్యాయులతో కలసి సుబ్రహ్మణ్య భారతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆయన జీవిత చరిత్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, కామేశ్వరమ్మ, శ్రీను, నగేష్, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.